RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
డిసెంబర్ : 19 గురువారం సంపుటి : 28 సంచిక : 297





## అన్నసముద్రం వద్ద రోడ్ ప్రమాదం - వ్యక్తి మృతి

2లో

# భూముల పరిరక్షణకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం





- భూకబ్జాదారుల కు జైలు కూడు తప్పదు
- ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

అగ్ని న్యూస్,మార్కాపురం (డిసెంబర్ 18):

భూముల పరిరక్షణకే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చామని మార్కాపురం శాసనసభ్యులు కందులనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని దరిమడుగు గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులు విచ్చలవిడిగా భూ ఆక్రమణలకు పాల్పడ్డారని,ఇదే దరిమడుగు గ్రామంలో వైసీపీ నాయకుల భారిన పడి చాలామంది భూములు కోల్పోయారని గుర్తు చేశారు. ఇటువంటి భూకబ్జాదారుల భరతం పట్టడానికి ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని, త్వరలోనే భూకబ్జాదారులకు శిక్షలు పడతాయని అన్నారు. ఎవరైనా భూ సమస్యలు ఉంటే అర్జీల రూపంలో రెవెన్యూ అధికారులకు సమర్పించాలని, తదనంతరం దానిపై పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తామని అన్నారు.ఈ సందర్భంగా ప్రజలు భారీ ఎత్తున అర్జీలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి, మునిసిపల్ కమీషనర్ నారాయణ రావు, తహశీల్దార్ చిరంజీవి, సర్పంచ్ బట్టగిరి గౌతమి గోపాల్ రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ జవ్వాజి రామాంజుల రెడ్డి, టిడిపి నాయకులు మొద్దు వెంకటరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, గ్రామ టీడీపీ నాయకులు,రెవిన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది దరిమడుగు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీశైలం అడవుల్లో తప్పిపోయిన భక్తులు



- ఎట్టకేలకు సురక్షితంగా బయటకు తీసుకొచ్చిన అధికారులు

(అగ్ని ప్రతినిధి, శ్రీశైలం)

శ్రీశైలం నల్లమల అటవీ ప్రాంతంలో 15 మంది భక్తులు తప్పిపోయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ ఇష్టకామేశ్వరి అమ్మవారిని దర్శించేందుకు భక్తులు కాలినడకన ఉదయం 11 గంటల సమయంలో వెళ్ళారు. మార్గం మిస్ కావడం వల్ల వారు అడవిలో తప్పిపోయారు. సాయంత్రం 4 గంటలకు 100కు కాల్ చేసి విషయం అధికారులకు తెలిపారు. బాపట్ల జిల్లా నిజాం పట్నానికి చెందిన వారిని సురక్షితంగా తీసుకొని వచ్చేందుకు అటవీ శాఖ రేంజర్ ఆరిఫ్ ఖాన్, సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు.వారివద్దకు చేరుకున్న అధికారులు వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.

## చెంచు కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

- ఐ.టి.డి.ఏ.పీడీ వెంకట శివప్రసాద్



అగ్ని న్యూస్,గిద్దలూరు (డిసెంబర్ 18) :

గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామంలో ఉన్న చెంచుకాలనీ ని ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె. వెంకట శివప్రసాద్ బుధవారం సందర్శించారు. కాలనీలో ఉన్న ఇంటి ఇంటికి తిరిగి వారి సమస్యలు

2లో

## అన్నసముద్రం వద్ద రోడ్ ప్రమాదం - వ్యక్తి మృతి

**మొదటి పేజీ తరువాయి**

అగ్ని న్యూస్, త్రిపురాంతకం (డిసెంబర్ 18): త్రిపురాంతకం మండలం అన్నసముద్రం మెట్ట వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదం లో గంగరాజు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. ఐ టి డి ఏ శ్రీశైలం స్పెషల్ ఆఫీసర్ కందుకూరి నాగేశ్వరరావు తన వ్యాగన్ఆర్ కారులో వినుకొండ నుండి ఎర్రగొండపాలెం వస్తుండగా, ఎదురుగా త్రిపురాంతకం నుండి ముడివేముల కు వెళుతున్న రొద్ద గంగరాజు అనే వ్యక్తి వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో గంగరాజుకు, వాహనంపై ఉన్న గంగరాజు భార్య నాసరమ్మకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం వినుకొండ తీసుకుని వెళుతుండగా మార్గమధ్యంలో గంగరాజు మరణించాడు. గంగరాజు భార్య ప్రస్తుతం వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నదని పోలీసులు తెలిపారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రిపురాంతకం పోలీసులు తెలిపారు.

## చెంచు కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం

**మొదటి పేజీ తరువాయి**

తెలుసుకున్నారు. ప్రజలు వినతి పత్రం ద్వారా వారి సమస్యలను ప్రాజక్ట్ డైరెక్టర్ కి తెలిపారు. అనంతరం ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పిల్లలతో మమేకమై పిల్లలను మధ్యాహ్న భోజన పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలు భోజనం బాగా ఉంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు యం. రంగస్వామి, అంగన్వాడి టీచర్,చెంచు కాలనీ వాసులు పాల్గొన్నారు.




## శానిటేషన్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి




అగ్నిన్యూస్,మార్కాపురం(డిసెంబర్18):

ఆరు నెలలుగా పెండింగ్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శానిటేషన్, వాచ్మెన్ లుగా పనిచేస్తున్న కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి కె యం రఫీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు, వాచ్మెన్ లకు జులై నుండి వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం వారి చేత చాకిరి చేయించు కుంటుందని, అతి తక్కువ వేతనం రూ6000 వేతనం వారికి చెల్లిస్తుందని అది కూడా ఆరు నెలల గా కార్మికులకు ఇవ్వకపోవటాన్ని ఆయన ఖండించారు. చాలీచాలని వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు.పేద బడుగు బలహీన వర్గాల వారు ఈ వృత్తిని నమ్ముకొని పారిశుద్య పనులు నిర్వహిస్తున్నారని వారికి నెలలు తరబడి వేతనాలు ఇవ్వకుంటే కార్మికుల కుటుంబాలు ఎలా జీవిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వేతనాలు లేక కుటుంబాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాఠశాల తెరవకముందే స్కూల్ కి వచ్చి పారిశుద్య పనులు చేస్తూ పాఠశాల మూసే వరకు అంటే ఎనిమిది గంటలు పైగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయక పోవడం విచారకరమని అన్నారు. కనీస వేతన చట్టాన్ని కార్మికులకు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫాం ప్రభుత్వం అందించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పి రూబెన్, మండల నాయకులు జి నాగరాజు, శానిటేషన్ యూనియన్ నాయకులు లక్ష్మీ, చంద్రకళ, మహాలక్ష్మి, కళావతి, రామలక్ష్మి, రమాదేవి, వాచ్మెన్ యూనియన్ నాయకులు రాజశేఖర్,కాశయ్య,యాకోబు తదితరులు పాల్గొన్నారు.

## కలుజువ్వలపాడు లో రెవిన్యూ సదస్సు







అగ్ని న్యూస్,తర్లుపాడు (డిసెంబర్ 18):

మండలంలోని కలుజువ్వలపాడు గ్రామం లో తహసీల్దార్ యూ విజయ భాస్కర్ అధ్యక్షతన వి ఆర్ ఓ షేక్ షరీఫ్ పర్యవేక్షణలో గ్రామంలో సచివాలయం వద్ద రెవిన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజల వద్ద నుండి తహసీల్దార్ అర్జీలను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్ యూ విజయ భాస్కర్ మాట్లాడుతూ మొత్తం 35 అర్జీలు వచ్చాయని ఎక్కువగా భూ సమస్యలపై అర్జీలు వచ్చాయని, వచ్చిన అర్జీలను 45 రోజుల్లో సమస్యలను పరిష్కారం చూపేవిధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.అంతేకాకుండా డీకే పట్టాల కొరకు అర్జీలు వచ్చాయని అన్నారు. ప్రజలకు భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు లేకుండా రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తామని, సమస్యల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు చేపడతామని జరిగిన తప్పులను సరిచేసేందుకు వీలుగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, మండల సర్వేయర్ సురేష్, ఈఓ ఈదుల చెన్నకేశవ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ రెడ్డి, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు మేకల అచ్చిరెడ్డి, మేకల నాగార్జున రెడ్డి, కూనపులి మహేష్, నాలి బాలయ్య,టీ రామకృష్ణ రెడ్డి, టీ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# రాజంపల్లి లో ఉన్న చెంచులు నిజమైన చెంచులే



- ఎస్సీ ఎస్టీ కేసులో రాజీకి, ఐటీడీఏ కాలనీ ఆక్రమణకు అడ్డుగా ఉన్నందుకే చెంచుల పై తప్పుడు ఫిర్యాదులు
- మార్కాపురం సబ్ కలెక్టర్ ఎస్.వి. త్రివినాగ్ కు తెలిపిన దళిత నేత నీలం నాగేంద్రరావు

అగ్ని న్యూస్,పెద్దారవీడు (డిసెంబర్ 18):

ఖరీదైన ఐటీడీఏ కాలనీ స్థలాన్ని కబ్జా చేసేందుకు, ఎస్సీ ఎస్టీ కేసులో రాజీ పడేలా చెంచుల్ని భయభ్రాంతుల్ని చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే రాజంపల్లి చెంచులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మార్కాపురం సబ్ కలెక్టరుకు తెలిపారు. బుధవారం పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామంలో నివసించే చెంచుల కుల నిర్ధారణపై మార్కాపురం సబ్ కలెక్టర్ బి.ఎస్.వెంకట త్రివినాగ్, డిటిడబ్ల్యూ రాజేశ్వరి, ఐటీడీఏ ఏపీఓ సురేష్ బాబులు జరిపిన సంయుక్త విచారణకు నీలం నాగేంద్రరావు హాజరయ్యారు. డెమొక్రటిక్ జర్నలిస్టు ఫోరం యూనియన్ సభ్యులు పాలపర్తి సతీష్ తదితరులు రాజంపల్లి గ్రామంలో నివసిస్తున్న చెంచులు ముత్తరాశి కులస్తులని, వీరంతా చెంచులుగా చలామణి అవుతున్నారని ప్రకాశం జిల్లా కలెక్టర్కు అలాగే, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రాజంపల్లి గ్రామంలో విచారణ జరిగింది. రాజంపల్లిలో జరిగిన విచారణకు చెంచులపై దాడి చేసిన నిందితులతో కలసి, చెంచులపై ఫిర్యాదు చేసిన సతీష్ హాజరైన ఫోటోను సబ్ కలెక్టర్కు చూపించారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు సబ్ కలెక్టర్ త్రివినాగ్ తో మాట్లాడుతూ రాజంపల్లి చెంచులు నిజమైన చెంచులే అనేందుకు తన వద్ద ఉన్న ఆధారాలను ప్రస్తావించారు.ప్రస్తుత పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాల ఊర తెగ చెంచులు 25 సంవత్సరాల క్రితం పెద్దారవీడు మండలం రాజంపల్లి గ్రామానికి వలస వచ్చారన్నారు. వ్యవసాయ పనులు, ఇటుక బట్టీలు వీరి జీవనాధారం అన్నారు. శ్రీశైలం ఐటిడిఏ రాజంపల్లి లో చెంచులకు కాలనీ, రోడ్లు, చర్చి, వాటర్ ట్యాంక్ నిర్మించిందన్నారు వీరి కమ్యూనిటీ అవసరాల కోసం ప్రభుత్వం 60 సెంట్లు స్థలాన్ని కేటాయించిందన్నారు. ఈ 60 సెంట్లు స్థలాన్ని రాజంపల్లికి చెందిన పాశం నాగేశ్వరరావు తదితరులు ఆక్రమించారన్నారు. రెవిన్యూ అధికారులు గ్రామ సభ పెట్టి, ఆక్రమణలు తొలగించారన్నారు. దీంతో చెంచులపై కక్షపెంచుకున్న పాశం నాగేశ్వరరావు, కాసు వెంకటరెడ్డి తదితరులు 30 మంది 2021 జూన్ 10న మారణాయుధాలతో చెంచు కాలనీపై సామూహిక దాడి చేశారన్నారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని, 12 మంది గాయపడ్డారని, జల్లా సాయి అనే యువకుడు కోమాలోకి వెళ్లాడన్నారు. పెద్దారవీడు పోలీసులు క్రైమ్ నెంబర్ 91/2021 గా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసును విచారించిన మార్కాపురం డీఎస్పీ కిషోర్ కుమార్ నిందితులకు అనుకూలంగా వ్యవహరించి, కొందరు నిందితుల పేర్లతో పాటు కొందరు బాధితులైన సాక్షుల పేర్లను చార్జ్ షీటులో తొలగించాడన్నారు. దీంతో తన సూచన మేరకు బాధితులు ఎస్సీ ఎస్టీ కోర్టులో డీఎస్పీ తొలగించిన పేర్లు కేసులో ఉండాల్సిందేనని పిటిషన్ వేశారు. బాధితుల వాదనతో ఏకీభవించిన కోర్టు, మార్కాపురం డిఎస్పి తొలగించిన కాసు వెంకటరెడ్డి తదితర నిందితుల పేర్లను కేసులో కొనసాగించింది. తేదీ 10-06-2021 జూన్ 10 వ తేదీన 91/21, 15 మంది మీద కేసు, పాశం నాగేశ్వర రావు తదితరులు 2024 సెప్టెంబర్ 10న ఎస్సీ ఎస్టీ కోర్టు ఈమేరకు ఆదేశాలు ఇచ్చింది.చెంచులు ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాక, రాజంపల్లి చెంచులు ఎస్టీలు కాదని ముత్తరాశి కులస్తులని స్థానిక ఎస్సీ యువకుడు ఇస్రాయేలుతో నిందితులు మొదట ఫిర్యాదు చేయించారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు డీఎస్పీ కిషోర్ కుమార్ రాజంపల్లి చెంచుల స్వస్థలమైన గుత్తికొండలో విచారించి వీరి కులాన్ని నిర్ధారించవలసిందిగా పిడుగురాళ్ల తహసిల్దారుకు లేఖ రాశారన్నారు. రాజంపల్లిలో నివసిస్తున్న చెంచులు గుత్తికొండకు చెందిన వారని, వీరంతా రాజంపల్లికి వలస వెళ్లారని పిడుగురాళ్ల తహసిల్దార్ నివేదిక ఇవ్వడంతో,డీఎస్పీ కిషోర్‌కుమార్ నిందితులపై చార్జ్ షీట్ వేశారు. చెంచులకు నీరు కరెంటు నిలిపివేశారనీ, కరువు పనుల్ని కల్పించలేదన్నారు.దీంతో సగం మంది చెంచులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారన్నారు. ఎస్సీ ఎస్టీ కేసు నిందితులు కలిగిస్తున్న ఇబ్బందులను అధిగమించి స్థానికంగా నివాసం ఉంటున్న చెంచులను రాజంపల్లి నుంచి వెళ్లగొట్టాలని, చెంచులు పెట్టిన ఎస్సీ ఎస్టీ కేసులో చెంచులు రాజీ పడేలా వారిని భయభ్రాంతులను చేసి, వారిపై ఒత్తిడి పెంచేందుకు నిందితులు కుట్ర చేశారన్నారు. ఇందులో భాగంగానే,వేరొక ఫిర్యాదు దారున్ని ఆశ్రయించి మరో తప్పుడు ఫిర్యాదు చేయించారన్నారు. పిడుగురాళ్ల తహసిల్దార్ సమాచార హక్కు చట్టం ద్వారా ఇచ్చినట్టుగా పాలపర్తి సతీష్ జిల్లా కలెక్టర్కు లోకాయుక్తకు చేసిన ఫిర్యాదులో జతపరిచిన జనన మరణాల పేజీ నకిలీ అని, సదరు పేజీ నకిలీ అనేందుకు గుర్తించిన ఆధారాలను,పిడుగురాళ్ల తహసిల్దార్ ఎండార్స్మెంట్ను నాగేంద్ర సబ్ కలెక్టర్కు చూపించారు. పాతికేళ్ల క్రితం రాజంపల్లికి వలస వచ్చి చెంచులుగా బతుకుతూ,కూలి పనులు చేసుకోవడమే తప్ప ఎస్టీ రిజర్వేషన్ ద్వారా ఈ 50 కుటుంబాల చెంచుల్లో పెద్దగా చదువుకున్న వారు గానీ, ఉద్యోగాలు చేస్తున్నవారు గాని లేరన్నారు. పాతికేళ్ల నుంచి చెంచులపై ఎలాంటి ఫిర్యాదు లేదని, చెంచు కాలనీ పక్కన కేంద్రీయ విద్యాలయం రావడంతో, ఆ స్థలాలకు మార్కెట్ విలువ పెరిగిందని, చెంచుల్ని ఆ స్థలాల నుంచి వెళ్ళగొట్టి ఆ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కొందరు స్థానికులు కుట్ర చేశాక చెంచులపై దాడులు, చెంచులపై తప్పుడు ఫిర్యాదులు మొదలయ్యాయన్నారు. స్వాతంత్రం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత కూడా వారింకా పూరి గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారని, ఆ నివాసాలను చూపించారు. అనంతరం చెంచుల పుట్టుక, వివాహం, మరణం కార్యక్రమాల్లో, అలాగే పండుగల్లో ఆచరించే ఆచార సాంప్రదాయాల గురించి, కొలిచే దేవతల గురించి నాగేంద్ర సబ్ కలెక్టర్కు వివరించారు. స్వాతంత్రానికి ముందు, స్వాతంత్రం వచ్చిన తర్వాత చెంచులకు జీవనం, ఆచార సాంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, భాష, ఉనికి కి సంబంధించి ప్రస్తావించిన ప్రభుత్వ పుస్తకాలను ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు సబ్ కలెక్టర్ కు తెలియపరిచారు.ఒకటి రెండు రోజుల్లో రిటర్న్ ఆర్గుమెంట్స్ ఇస్తామని నాగేంద్ర సబ్ కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ప్రధాన కార్యదర్శి కాకుమాను రవి,దళిత నాయకులు మాలపోలు శాంత కుమార్, మాజీ సర్పంచి జల్లా రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి కేవలం 499/- మాత్రమే only soft copy

RK అగ్ని న్యూస్ The Power Of Truth



## అన్నదాతలకు కబ్జాదారుల బెడద తప్పడం లేదు..!

- రికార్డులు దిద్దులకు గురవుతున్నాయి
- కలెక్టర్ స్పందించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు



అగ్నిన్యూస్,తర్లుపాడు(డిసెంబర్18): మండలంలో కొద్దిరోజుల క్రితం వెలుగు చూసిన భూ దందాను మర్చిపోయే లోపే మరో భూ ఆక్రమణ వెలుగులోకి వచ్చింది. మండలంలోని జగన్నాధపురం గ్రామానికి చెందిన బత్తుల రంగయ్య అనే రైతు 30 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న భూమిని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వేరే వ్యక్తి పేరున ఆన్లైన్ చేశారు.దీంతో రైతు రంగయ్య పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం పై ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకు ముందు రెవెన్యూ రికార్డులలో తన పేరే ఉండేదని అధికారులు ఉద్దేశపూర్వకంగా తన భూమిని వేరే వ్యక్తి పేరున ఆన్లైన్ చేశారని బాధితుడు వాపోతున్నాడు. 1989 లో నాగం కోటయ్య దగ్గర నుండి తన తండ్రి భక్తుల రంగయ్య కొనుగోలు చేసారని తదనంతరం తన తండ్రి పేరు మీద అడంగల్ లో నమోదు అయ్యిందని గతం లో పనిచేసిన తహసీల్దార్ అబ్దుల్ హమీద్ వారిని ఆన్లైన్ లో తొలగించాలని సిఫారసు చేసారని కానీ ఆరోజు రికార్డు లో ఉన్న తన తండ్రి పేరు ఈరోజు కొట్టివేతకు గురి అయ్యిందని స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో పని చేసే క్రింది స్థాయి ఉద్యోగి దిద్దులకు పాల్పడినట్లు బాధితులు ఆరోపణలు చేస్తున్నారు. అప్పటి నుండి నేటి వరకు కూడా సాగులో భక్తుల రంగయ్య అనే వారే వున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి తన భూమిని ఆన్లైన్ లో ఎక్కించి పాసు పుస్తకాలు మంజూరు చేయాలనీ వేడుకుంటున్నాడు. దిద్దులకు పాల్పడుతున్న వారి పై సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

## రథసప్తమి ఉత్సవ కమిటీ కై కసరత్తు

- కమిటీ ప్రకటించిన ఎమ్మెల్యే కందుల



అగ్ని న్యూస్, మార్కాపురం (డిసెంబర్ 18):మార్కాపురం ఇలవేల్పు అయిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి రథసప్తమి ఉత్సవ కమిటీ ఏర్పాటు కోసం బుధవారం ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున, యక్కలి కాశీ విశ్వనాథం, ఆలంపల్లి శ్రీనివాసులు, మొద్దు వెంకటరెడ్డి,బొంతల సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని, ఇందుకు ఉత్సాహంగా పనిచేసే వారికి కమిటీ లో అవకాశం ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే కందుల తెలిపారు. పలు విషయాలు చర్చించిన అనంతరం ధనంకుల హరిబాబు,ఆలంపల్లి ప్రదీప్, టైలర్ అనిల్ తదితరులను కమిటీ లో సభ్యులు గా తీసుకున్నారు. ఉత్సవ కార్యక్రమాలు యక్కలి కాశీ విశ్వనాథం నేతృత్వంలో జరగనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.




## గోళ్ళ ను వరించిన మరో ఉన్నత పదవి

అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (డిసెంబర్ 18):

యర్రగొండపాలెం ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారవేత్త గోళ్ళ సుబ్బారావుకు మరో అత్యున్నత పదవి లభించింది. గడిచిన దశాబ్దాల కాలంగా పార్టీలకతీతంగా బాధ్యతలు నిర్వహిస్తూనే ఉన్నారు. గతంలో తెదేపా తరపున ఆయన తండ్రి సర్పంచిగా బరిలో నిలిచి ఉన్నారు. ఈ క్రమంలోనే గోళ్ళ సుబ్బారావు సైతం డాక్టర్ రవీంద్ర ప్రథమ శిష్యుడిగా పేరుగాంచి ఉన్నారు. తెలుగుదేశం పార్టీలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికి నేనున్నాను అంటూ ఆర్థిక సహాయం చేపడుతూ ప్రజల మన్ననలను పొంది ఉన్నారు.తెలుగుదేశం పార్టీలో గోళ్ళ వంశం అంటే అది కేవలం సుబ్బారావు ద్వారానే సుపరిచితంగా మారింది.అలాగే వారి కుటుంబీకులు ప్రతిఏటా అర్చకులకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు వారిని సత్కరిస్తూ నియోజకవర్గంలో పేరు సంపాదించుకుని ఉన్నారు. ప్రస్తుతం గోళ్ళ సుబ్బారావు సైతం గతంలో త్రిపురాంతక క్షేత్ర చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి ఉన్నారు. ఈ క్రమంలోనే నూతనంగా వాసవి క్లబ్స్ అంతర్జాతీయ కార్పొరేట్ వైస్ చైర్మన్ గా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తనకు పదవి బాధ్యతలు అప్పగించిన వాసవి క్లబ్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు వాసవి క్లబ్ ద్వారా బాధ్యతలు అప్పగించిన నిర్వాహకులకు ఆయన తన అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో నియోజక వర్గంలో వాసవి క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గోళ్ళ సుబ్బారావును నియోజకవర్గ ఆర్యవైశ్య ప్రముఖులతోపాటు పలువురు ఆయనను అభినందించారు

## ముంబైలో ఘోర పడవ ప్రమాదం - 13 మంది మృతి?



(అగ్ని ప్రతినిధి, ముంబై)

ముంబై తీరంలో ఘోర పడవ ప్రమాదం చోటు చేసుకుంది. బోటులో విహరిస్తూ ఆహ్లాదకరంగా గడుపుతున్న పర్యాటకులకు ఊహించని పరిణామం ఎదురైంది. ఓ స్పీడు బోటు అమాంతంగా వచ్చి ఢీకొట్టడంతో ఫెర్రీ బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో 13 మంది మృతి చెందినట్లుగా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ప్రకటించారు.నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 101 మందిని కాపాడినట్లు తెలిపారు. అప్రమత్తమైననేవీ గార్డ్స్, పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు.ముంబైలోని 'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి ఎలిఫెంటా గుహలకు ఫెర్రీ బోటు ప్రయాణికులతో వెళ్తోంది. అయితే అత్యంత వేగంగా దూసుకొచ్చిన ఓ స్పీడ్ బోటు ఢీకొట్టింది.దీంతో ఫెర్రీ బోటు మునగడం ప్రారంభించింది. దీంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు రక్షించాలంటూ ఆర్తనాదాలు చేశారు. మరికొందరు ప్రాణభయంతో బెంబేలెత్తి పోయారు. మరికొందరు షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. పోర్టు అధికారులు, కోస్ట్‌గార్డ్, మత్స్యకారుల సహాయంతో వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమయంలో ఫెర్రీలో దాదాపు సిబ్బందితో పాటు 85 మంది ప్రయాణీకులు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే స్పీడ్ బోటు వేగంగా ఢీ కొట్టిన దృశ్యాలు.. మొబై ల్‌లో రికార్డ్ అయింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియా లో వైరల్ అవుతున్నాయి.ఇదిలా ఉంటే ఫెర్రీ బోల్తా పడే సమయంలో లైఫ్ జాకెట్లు ధరించి ఉన్నారు. అయితే కొందరు ప్రయాణికులు ప్రాణభయంతో బెంబేలెత్తి పోయినట్లుగా కనిపిస్తోంది. స్పీడ్ బోటు ఢీకొట్టగానే సెకన్లలోనే ఫెర్రీ మునిగిపోయింది.ఒక వైపు ఒరిగిపోయింది. ఈ గందరగోళంలో కొందరు మునిగి పోయినట్లుగా తెలుస్తోంది.దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy



# ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

## హర్షం వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు ఉదయ్

అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 18):

జిల్లా లోని  కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలపడం అభినందించదగ్గ విషయం అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ కు, కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రకాశం జిల్లాలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం గొప్ప విషయమని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం శుభ సూచకమని అన్నారు. సాగరమాల-2 ప్రాజెక్టు కింద కొత్తపట్నం మండలంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టి దానికి అవసరమైన 40 ఎకరాల భూమిని గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి ఆదేశాలు జారీ చేశారని, కాబట్టి ఈ నిర్మాణం ద్వారా జిల్లా వాసుల కల కచ్చితంగా నెరవేరుతుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎంతో దూర దృష్టితో రాష్ట్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తుందని కేంద్ర సహకారాన్ని ప్రతి ఒక్కరూ అభినందించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషి కూడా అద్భుతంగా ఉందని ఆయన కొనియాడారు.

# ఆ ఊరికి వెళ్ళాలంటే గుండె దండే..!




అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 18): గిద్దలూరు పట్టణంలోని కొండపేట రైల్వే బ్రిడ్జి నుంచి కొండపేట కు వెళ్లే దారి, పాముల పల్లె వెళ్లే దారి గత 20 రోజుల నుంచి వీది దీపాలు వెలగక రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు రాత్రి సమయంలో ఈ మార్గంలో నడవాలంటే ప్రజలు భయాందోళన చెందుతూ వెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించ వలసిన వార్డ్ సచివాలయం ఉద్యోగస్తులు సచివాలయంలో  కుర్చీలకు మాత్రమే పరిమితం అయ్యారు...ఇప్పటికైనా సంబంధించిన అధికారులు స్పందించి రాత్రి సమయాలలో అక్కడ వీధి దీపాలు వెలిగే విధంగా చేయాలని ప్రజలు కోరుచున్నారు.




# విశాఖలో నేడు ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌక జాతికి అంకితం



(అగ్ని ప్రతినిధి,విశాఖపట్నం)

ఏపీలో నౌకాదళం హైడ్రో గ్రాఫిక్ సర్వేల కోసం ఉద్దేశించిన ఐఎన్ఎస్ నిర్దేశక్ నౌకను నేడు జాతికి అంకితం చేయనున్నారు. విశాఖ నావెల్ డాక్ యార్డ్లో జరగనున్న ఈ కార్యక్రమానికి రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేత్ పాల్గొని నిర్దేశక్ నౌకను జాతికి అంకితమిస్తారు. కోల్కతాలోని జీఆర్ఎస్ఈలో దేశీయంగా 80 శాతం పరికరాలతో ఐఎన్ఎస్నిర్దేశక్ నౌక నిర్మాణం జరిగింది. 110 మీటర్ల పొడవు,3800 టన్నుల బరువైన ఈ నౌకను రెండు ఇంజన్లతో రూపకల్పన చేశారు.

# స్కూల్ బస్సు కింద పడి రెండేళ్ల చిన్నారి మృతి

(అగ్ని ప్రతినిధి, కందుకూరు):



నెల్లూరు జిల్లా కందుకూరు మండలంలో బుధవారం హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. అనంత సాగరం గ్రామానికి చెందిన గోగినేని శ్రీకాంత్-నాగమణి దంపతులకు భార్గవ్, మోక్షజ్ఞ (2) ఇద్దరు కుమారులు. భార్గవ్ కందుకూరు లోని ఓ పాఠశాలలో ఎల్కేజీ చదువుతున్నాడు. రోజులాగే భార్గవ్ను స్కూల్ బస్సు ఎక్కించేందుకు తల్లితో పాటే వెళ్లిన మోక్షజ్ఞ, వాహనం టైరు కింద పడి నలిగి పోయాడు. కొడుకు మృత దేహాన్ని పట్టుకుని తల్లిదండ్రులు విలపించినతీరు అందరినీ కంటతడి పెట్టించింది.

## ఎస్పీ దామోదర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్న గిద్దలూరు సీఐ సురేష్




అగ్ని న్యూస్, గిద్దలూరు (డిసెంబర్ 18):

గిద్దలూరు పట్టణంలోని అనేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ ట్రాఫిక్ నియంత్రణలో తనదైన శైలిలో పనిచేస్తున్న సిఐ సురేష్ ను జిల్లా ఎస్పీ దామోదర్ అభినందించారు. ఎన్నడూ లేని విధంగా గిద్దలూరు పట్టణం లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేసి ఫ్రెండ్లీ పోలీస్ పేరు తెచ్చుకున్న సురేష్ కి ప్రశంస పత్రాన్ని అందజేశారు. పోలీసులు విధి నిర్వహణలో సమర్ధవంతంగా పనిచేసి,ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ దామోదర్ సూచించారు.





# పెద్దన్న కు లైన్ క్లియర్ చేసుకున్న పవన్...?

(అగ్ని ప్రతినిధి, అమరావతి)

రాష్ట్రపతి కోటాలో రాజ్యసభకు ఖాళీలు ఉన్నాయి అనే వార్త వచ్చిన దగ్గరనుంచి మన తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరు వెళ్లే అవకాశం ఉందని చాలామంది ఎదురు చూస్తూ ఉంటారు. రాజకీయ ప్రముఖులు చాలామంది రాజ్యసభకు వెళ్లడానికి ఆసక్తి ప్రదర్శిస్తూ ఉంటారు. ప్రస్తుతం రాష్ట్రపతి కోటాలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. జులైలో ఈ నాలుగు స్థానాలు ఖాళీ కాగా... దీనిపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. జనవరిలోగా ఈ ఖాళీలను పూర్తి చేయాల్సి ఉంటుంది.ఎవరిని ఎంపిక చేయాలి ఏంటి అనేదానిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అలాగే బిజెపి జాతి అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రాకపోయినా కొన్ని పేర్లు మాత్రం ఇప్పటికే బయటకు వస్తున్నాయి. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి చిరంజీవి పేరు ప్రముఖంగా వినపడుతోంది. అలాగే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పేరు కూడా చర్చల్లో ఉందని సమాచారం. కేంద్ర హోం మంత్రి అమిత్ షా,సహాబిజెపి అగ్రనేతలతో వెంకయ్య నాయుడుకి మంచి సంబంధాలు ఉన్నాయి.దీనితో ఆయనను రాజ్యసభకు తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం కూడా జరుగుతుంది. అలాగే తమిళనాడు నుంచి రజినీకాంత్ ను కూడా రాజ్యసభకు ఎంపిక చేసే అవకాశం ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి. అయితే రజనీకాంత్ ఈ మధ్యకాలంలో డిఎంకె పార్టీకి బాగా దగ్గరయ్యారు.తమిళ స్టార్ హీరో విజయ్ పార్టీ పెట్టిన సమయంలో కూడా డీఎంకే పార్టీని ఎవరు ఏం చేయలేరంటూకామెంట్స్ చేశారు. మరి ఆయనను ఎంపిక చేస్తారా లేదా అనేదానిపై మాత్రం స్పష్టత లేదు. అయితే ఈసారి కేరళ నుంచి ఒక మాజీ ఎమ్మెల్యేకి రాజ్యసభలో అవకాశం కల్పించేందుకు రెడీ అవుతున్నట్లుగా సమాచారం.

కేరళలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నం చేస్తున్న భారతీయ జనతా పార్టీ... ఇప్పుడు కేరళ నుంచి ఓ అభ్యర్థిని ఎంపిక చేసినట్లు వార్తలు వస్తున్నాయి. వెంకయ్య నాయుడుని చిరంజీవిని మన తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపిక చేయడం ఖాయం అంటున్నారు.తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని భారతీయ జనతా పార్టీ పెద్దలు తీవ్రంగాప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చే ఎన్నికలలో ఎలాగైనా అధికారంలోకి రావాలని పట్టుదలగా ఉన్నారు. దీనితో చిరంజీవిని రాజ్యసభకు పంపాలని కాస్త గట్టిగానే వర్కౌట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి కూడా దీనికి అంగీకారం తెలిపారట. ఇటీవల పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లిన సమయంలో దీనిపై చర్చ జరిగినట్లు ఢిల్లీ వర్గాలు అంటున్నాయి.

పంతులు
మెస్
ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర, మార్కాపురం




మార్కాపురం మునిసిపాలిటి కి మరియు తర్లుపాడు మండల కేంద్రానికి చేరువలో ఉన్న ఏకైక ఎర్ర చందనం ఫార్మ్ ల్యాండ్ వెంచర్

మరింత సమాచారం కొరకు సంప్రదించండి
+91 9111 822 822

30 అడుగుల రోడ్లతో, మెరుగైన సదుపాయాలతో, రెండు వైపులా హైవేని కనెక్ట్ చేసే ఆర్ & బి రోడ్లను కలిగిన ఏకైక ఎర్ర చందనం ఫార్మ్ ల్యాండ్ వెంచర్.

కంపెని డైరెక్టర్స్: మేడం సత్యనారాయణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, జవ్వాజి సాయికృష్ణ

# ఆ పదవి ఎవరికి దక్కేనో...!



## - తాటిపర్తి మనసులో ఎవరున్నారో...?

















అగ్ని న్యూస్, పెద్దారవీడు(డిసెంబర్ 18):

మండల వైసిపి కన్వీనర్ పదవి బిసి సామాజిక వర్గానికా? ఓసి సామాజిక వర్గానికా? ఎవరికి దక్కనుందో?... ఈ విషయంలో శాసనసభ్యుల వారి మనసులో ఏమి ఆలోచన ఉందో? అనే అనేక రకాల ఊహాగానాలు ప్రజలతో పాటు వైసిపికి చెందిన ఆశావహుల్లో కూడా సందిగ్ధత నెలకొంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి ఆదిములపు సురేష్ ఆమోదంతో కన్వీనర్ పదవిని ఓసి సామాజిక వర్గానికి చెందిన పాలిరెడ్డి కృష్ణారెడ్డి కు కేటాయించడం జరిగింది. అప్పటి నుండి పార్టీ శ్రేణులంతా ఒకే తాటిపై నిలిచి ఏవిధమైన వివాదాలు లేకుండా పార్టీ కోసం కష్టించి పని చేశారు. తర్వాత పరిణామాల నేపథ్యంలో ఎర్రగొండపాలెం వైసిపి అభ్యర్థిగా తాటిపర్తి చంద్రశేఖర్ పోటీ పడడంతో రాజకీయం రసవతంగా మారింది. స్థానిక నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి ఐదు మండలాల్లో పెద్దారవీడు మండల మెజార్టీ తాటిపర్తి గెలుపుకు దోహద పడింది. అంతేకాకుండా తాటిపర్తి చంద్రశేఖర్ తక్కువ కలంలో వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవడంతో గెలుపుతోపాటు మండలంలో అత్యధిక మెజారిటీని రాబట్టడంలో కూడా కీలక పాత్ర పోషించారు. ఆయనకు కొంతమంది నాయకులు చేదోడు వాదడుగా నిలిచారు..తదనంతర పరిణామాల్లో పార్టీ అధికారం పోవడం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో మాత్రం ఎమ్మెల్యేగా తాటిపర్తి గెలుపొందడంతో మండల కన్వీనర్ పదవి మార్పు తథ్యం అనే సంగతి ప్రజలందరికీ విదితమే.అయితే అసలు కథ ఇప్పుడే మొదలైంది. మండల వైసిపి కన్వీనర్ పదవి నాకు కావాలి అంటే నాకు కావాలి అనే పోటీ అంతర్గతంగా నెలకొని ఉందనేది బహిరంగ రహస్యంగా నడుస్తోంది.దాంతో ఈ పదవిని బీసీ సామాజిక వర్గానికి ఇస్తే మండల బీసీ సెల్ అధ్యక్షుడు తోకల ఆవుల యాదవ్, కంచర్ల కేశయ్య, మైనార్టీ వర్గం నుంచి షేక్ బుజ్జి పోటీ పడుతున్నారు.ఓసి సామాజిక వర్గానికి చెందిన ప్రస్తుత కన్వీనర్ పాలి రెడ్డి కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గుండారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కోటిరెడ్డి తనయుడు సీనా రెడ్డి, వజ్రాల ఆది నారాయణ రెడ్డి పోటీ పడుతున్నారు. మరోవైపు పార్టీపరంగా నిష్కళంకమైన మనసుతో నిర్దిష్ట ప్రణాళికతో అందరిని కలుపుకుపోతూ, సీనియరుగా, పార్టీపరంగానూ శాసనసభ్యుల వారికి అన్ని విధాలుగా సహకారం అందించేవారు, వివాదరహితుడిగా పేరొందిన, ఆర్థికంగా బలమైన ఓసి సామాజికవర్గానికి చెందిన వ్యక్తలకు కి ఇస్తారో? లేక బీసీ అభ్యర్థికి ఇస్తారో, ఇదీ అదీ కాకుంటే ముస్లిం సామాజికవర్గాము చెందిన వారిని నియమిస్తారో ? అనే సందిగ్ధత మండల ప్రజానీకంతో పాటు ఆశావహుల్లో కూడా నెలకొని ఉంది. మరి ఈ సందిగ్ధతకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఎప్పుడు ముగింపు పలుకుతారో వేచి చూడాలి. సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే దాకా ఎదిగిన తాటిపర్తి చంద్రశేఖర్ మనసులో ఆల్రెడీగా పార్టీ కోసం కష్టపడిన నాయకుడు ఒకరు ఉన్నారని , ఎవర్ని తన టీం లోకి తీసుకోవాలో ఆయనకి బాగా తెలుసు అని విశ్లేషకుల భావన.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో: అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)